క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సిద్దిపేట విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలను కైవసం చేసుకున్నారని తెలంగాణ రాష్ట్ర కరాటే అధ్యక్షుడు సోమవారం తెలిపారు. హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో రాష్ట్ర క్రీడా సమాఖ్య, ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో సోమవారం ఈ పోటీలు నిర్వహించారు. సిద్దిపేట జపాన్ కరాటే షోటోకాన్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణకు చెందిన విద్యార్థులు మీర్జా అబ్దుల్ ఆహాద్ అలీ బేగ్, అరిభ బంగారు పతకాలు, అస్మా వెండి పతకం సాధించిందని ఆయన తెలిపారు. వారిని కోచ్‌లు అభినందించారు.

వాలీబాల్ క్రీడలో రాణింపు


విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని బందారం హైస్కూల్ విద్యార్థులు అండర్ 17 విభాగం వాలీబాల్ పోటీలో ద్వితీయ స్థానంలోను, అండర్ 14 విభాగంలో తృతీయ స్థానంలోను నిలిచి బహుమతులు అందుకున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో సోమవారం జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలైన క్రీడాకారులు జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం రామచంద్రం తెలిపారు. ఆ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయుడికి రాష్ట్రస్థాయి అవార్డు


అవార్డు అందుకుంటున్న బ్రహ్మయ్య

మర్కూక్(గజ్వేల్): ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని దామరకుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బ్రహ్మయ్య సోమవారం రాష్ట్ర స్థాయి ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల అభ్యున్నతికి చేసిన కృషిని గుర్తించి హైదరాబాద్‌లోని బిర్లా భాస్కర ప్లానిటోరియం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేశారన్నారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ, స్కైలైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమయ్య, మైనష్ జిందాల్, జ్యోత్స్న, డీఎంఆర్ఎల్ సైంటిస్టులు నిరంజన్, నాయక్, పట్నం కమలా మనోహర్, నరేంద్ర స్వామి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు.

ఎర్రవల్లి గ్రామస్తుల ఫిర్యాదు

మర్కూక్(గజ్వేల్): గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించి రెండేళ్లు గడుస్తున్నా తమకు నిర్మించి ఇవ్వలేదని కేసీఆర్ దత్తత గ్రామమైన ఎర్రవల్లికి చెందిన సురేశ్, పరశురాములు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 2022లో డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించి పంచాయతీలో తీర్మానం చేశారని, ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. కలెక్టర్ స్పందించి సంబంధిత ఈఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించినట్లు వారు తెలిపారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

నంగునూరు(సిద్దిపేట): మహిళా సంఘాల పేర్లు ఆన్‌లైన్ చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశామని జేపీ తండా మాజీ సర్పంచ్ బూక్య భిక్షపతి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేపీతండా నూతన పంచాయతీగా ఏర్పాటైనప్పటి నుంచి మహిళా సంఘం పేరు ఆన్‌లైన్ కాకపోవడంతో సభ్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి: బీజేపీ నేత

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ తహసీల్దార్ సరితకు వినతి పత్రం అందచేశామన్నారు. కార్యక్రమంలో రజనీకర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సురేందర్ రెడ్డి, సతీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఐ జాన్ విల్సన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏసీపీ సతీశ్, సిబ్బంది


రాయపోల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు, పోలీసులు

ప్రజల రక్షణ కోసమే పోలీసులు

ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: శాంతిభద్రతలు, ప్రజల రక్షణ కోసమే పోలీసులు నిరంతరం పని చేస్తారని ఏసీపీ సతీశ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర జవాన్‌లకు పోలీసులు సోమవారం నివాళులర్పించారు. స్థానిక స్టేషన్ ఆవరణలోని ఎస్ఐ జాన్ విల్సన్ విగ్రహానికి, సీఐ యాదగిరి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ 1989 బ్యాచ్‌కు చెందిన ఎస్ జాన్ విల్సన్, సీఐ యాదగిరి రామవరంలో అప్పటి పీపుల్స్‌వార్ పేల్చిన మందుపాతరలో అసువులు బాసారన్నారు. జాన్ విల్సన్‌కు ఈ ప్రాంతానికి వీడదీయలేని అనుబంధం ఉందని, ప్రజల సమస్యలను పరిష్కరించి వారి హృదయాల్లో స్థానం సంపాదించారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్, కౌన్సిలర్లు భాగ్యరెడ్డి, పద్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

దుబ్బాకటౌన్/గజ్వేల్‌రూరల్: శాంతి భద్రతల పరిరక్షణ, విధి నిర్వహణలో అమరులైన పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిదని బీజేపీ జిల్లా ఆర్మీ సెల్ కన్వీనర్, రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీలా చంద్రం, ఏఎస్ఐ దేవయ్య అన్నారు. రాయపోల్‌లో పోలీసు అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పళ్లు పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి మహారాజ్, రాజాగౌడ్, వెంకట్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి, కానిస్టేబుల్ స్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు మరువలేనివని రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ప్రశంసించారు. గజ్వేల్‌లోని రామకోటి కార్యాలయంలో నల్ల నువ్వులతో ఆరు అడుగుల స్తూపాన్ని చిత్రించి నివాళులర్పించారు.


చేర్యాల(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న సీఐ శ్రీను, ఎస్ఐ నీరేశ్, పోలీసు సిబ్బంది


గజ్వేల్‌లో నల్ల నువ్వులతో చిత్రించిన స్తూపం

ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం

కాంగ్రెస్ నేత పూజల హరికృష్ణ

సిద్దిపేటరూరల్/మద్దూరు(హుస్నాబాద్)/మిరుదొడ్డి(దుబ్బాక)/తొగుట(దుబ్బాక): ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడొద్దని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. నారాయణరావుపేట మండలంలోని పలు గ్రామాలతో పాటుగా రూరల్ మండల పరిధిలోని పుల్లూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి రాగానే రుణమాఫీచేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులు, నిర్వాహకులకు సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీరాములు, ఏపీఎంలు విజయనిర్మల, చంద్రం, ఏఓ పరశురాం రెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని లద్నూరు, ధర్మారం, మర్మముల, సలాఖపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇల్రి, కాంగ్రెస్ నాయకులు పద్మారెడ్డి, రాజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, బాలరాజు, సుదర్శన్, సురేశ్, శ్రీధర్‌రెడ్డి, సీఈఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డి పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి ఆధర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ వైస్ ఎంపీపీ సాయిలు, రాజేశ్, కిష్టయ్య, శంకర్, వెంకట్ స్వామి గౌడ్, నాగులు, రాజు, నర్సింహులు, భూమాగౌడ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు. తొగుట మండల పరిధిలోని గుడికందుల, లింగంపేట, రాంపూర్ గ్రామాల్లో సొసైటీ వైస్ చైర్మన్‌తో కలిసి సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణారెడ్డి వద్ద కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ జయమ్మ, రమేశ్‌గౌడ్, యాదయ్య, భైరారెడ్డి, ఏఈఓ రాజేశ్, కార్యదర్శి శ్యామల, చంద్రశేఖర్, హుస్సేన్ పాల్గొన్నారు.


సిద్దిపేటరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరికృష్ణ

హుస్నాబాద్ విలీనం ఖాయం: కాంగ్రెస్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం హుస్నాబాద్ ప్రాంతాన్ని కరీంనగర్‌లో విలీనం చేయడం తథ్యమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. రామవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి అనంతరం వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో హుస్నాబాద్‌ను మూడు ముక్కలు చేశారని, పదేళ్లు అధికారంలో ఉండి గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను పూర్తిచేయలేని వాపోయారు. మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే అర్హతలేదని మండిపడ్డారు. మండలంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో 26కేంద్రాలకు గాను 18కేంద్రాలను ప్రారంభించుకున్నామని, అలాగే ఐకేపీ ఆధ్వర్యంలో 11 కేంద్రాలలో రెండు మూత పడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎల్లయ్య, నాయకులు తిరుపతినాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అయిలయ్య

వైకుంఠధామాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం..

మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులోగల వైకుంఠధామాన్ని త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తామని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్ తెలిపారు. అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో రూ.30 లక్షలతో పనులు మొదలు పెట్టినా, నిధులు సరిపోలేదని చెప్పారు. అన్ని వసతుల కల్పించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కలెక్టర్ మను చౌదరికి నివేదిక పంపిస్తామని తెలిపారు. వైకుంఠధామంలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, గదుల నిర్మాణం లాంటి వసతులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం పదో వార్డులో నూతనంగా నిర్మించిన డీఆర్సీ కేంద్రం, వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ రెండు కేంద్రాలను కూడా త్వరలోనే వినియోగంలోకి తీసుకు వస్తామని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్, దిలీప్, నాయకులు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న రమేశ్ కుమార్

ఎదుగుదలకు ముఖ్య పోషకం అయోడిన్

ఎంహెచ్ఎన్ ప్రోగ్రామ్ అధికారి ఆనంద్

కొండపాక(గజ్వేల్): శారీరక, మానసిక ఎదుగుదలకు అయోడిన్ ఓ ముఖ్య పోషకమని ఎంహెచ్ఎన్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఆనంద్ తెలిపారు. స్థానిక మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో సోమవారం ప్రపంచ అయోడిన్‌లోపం వల్ల వచ్చే వ్యాధుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల పిల్లలో జ్ఞాపకశక్తి మందగించడం, బుద్ధి మాంద్యం అలాగే మహిళల్లో గర్భస్రావం, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం, మరుగుజ్జతనం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి అయోడిన్ గురించి వివరించారు. కార్యక్రమంలో నారాయణరావు, శ్రీధర్, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్స్ రాజేందర్, రమణ, డీపీఎంఓ లక్ష్మణచారి, హెచ్ఈఓ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రోగ్రామ్ అధికారులు

చెట్లను తొలగించిన వ్యక్తికి జరిమానా

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి వెంబడి ఉన్న చెట్లను తొలగించిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించారు. చెట్లను నరికిన విషయంపై గత 20న సాక్షి దిన పత్రికలో వచ్చిన 'హరితహారం.. వృథాగా ప్రజాధనం' అనే కథనానికి ఫారెస్టు అధికారులు స్పందించారు. చెట్లను తొలగించిన వ్యక్తి నుంచి జరిమానా వసూలు చేయాలని ఫారెస్టు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోమవారం అతడి నుంచి రూ.4,155లను జరిమానా కట్టించినట్లు సెక్షన్ అధికారి రమేశ్ తెలిపారు.


జరిమానా రశీదు

సాక్షి ఎఫెక్ట్..

దుబ్బాక ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

3.5 కిలోల గడ్డ తొలగింపు

దుబ్బాక: ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్, ప్రముఖ సర్జన్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో సోమవారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ఆయన ఆధ్వర్యంలో వైద్యబృందం గంటన్నరకు పైగా శ్రమించి ఓ వ్యక్తి మెడ భాగంలో ఉన్న మూడున్నర కిలోల నెక్ ఫైబ్రో లైపోమ గడ్డను తొలగించారు. కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డికి చెందిన సిద్ధిరాములు తన మెడ భాగంలో పెద్దగడ్డతో తీవ్రంగా బాధపడేవాడు. ఆయన దుబ్బాక ఆస్పత్రిని ఆశ్రయించగా వైద్యులు పరీక్షలు నిర్వహించి దానిని నెక్ ఫైబ్రో లైపోమ గడ్డగా గుర్తించారు. ఈ క్రమంలో సోమవారం గంటన్నరపాటు శ్రమించి గడ్డను విజయవంతంగా తొలగించారు. హేమరాజ్‌సింగ్‌తో పాటు వైద్యులు రఘు, రాఘవేందర్ ఉన్నారు.


శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం

ఆస్తిపన్ను వసూలు పరిశీలన

సిద్దిపేటజోన్: నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో ఆస్తిపన్ను వసూలు ప్రక్రియను పరిశీలించారు. వంద శాతం పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. రెండు ఇళ్లకు చెందిన రూ.3.31 లక్షల ఆస్తిపన్నును ఆయన వసూలు చేశారు. ఆయన వెంట రెవెన్యూ అధికారి శ్రీకాంత్, బిల్ కలెక్టర్లు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

కోహెడరూరల్(హుస్నాబాద్): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను సోమవారం ఉదయం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని నారాయణపూర్ శివారు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారం మేరకు పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని యజమాని నాగరాజుపై కేసు నమోదుచేశారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 17మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.29,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పిడుగు పాటుకు పశువులు మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట)/హుస్నాబాద్‌రూరల్: పిడుగు పాటుకు ఓ పాడి పశువు మృతి చెందిన ఘటన మండలంలోని చెలుకలపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొలనుపాక కనకారెడ్డి పశువుల పాక వద్ద సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి పిగుడు పడింది. దీంతో సమీపంలో ఉన్న పాడిపశువు మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.80 వేల ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు. అలాగే హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామంలో పిడుగుపడి పాడి పశువు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. భైరి లక్ష్మి తన పాడి ఆవును మేత కోసం బావి దగ్గర వదిలేసింది. పిడుగు పడడంతో పశువు మరణించిందని, ఆవు విలువ రూ.70వేలు ఉంటుందని, ఆమెకు ఆర్థిక సహాయంచేసి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బత్తిని సాయిలు, బొమ్మగాని రాజ్‌కుమార్ కోరారు.

రాజకీయ ప్రయోజనం కోసమే ఆరోపణలు

డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట)/హుస్నాబాద్: బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని డీసీసీ ప్రధాన కార్యాదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే హరీశ్‌రావు తన అనుచరులతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆయన వెంట నాయకులు జయంత్, ప్రశాంత్, నరేశ్, మహేందర్, వేణు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు లేదని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. హుస్నాబాద్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎరువులు ఇస్తామని, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేసిందని, గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ నిర్మాణాల కోసం రూ.437కోట్లు, రహదారుల విస్తరణ పనుల కోసం మంత్రిపొన్నం మంజూరు చేయించారన్నారు. సమావేశంలో నేతలు చందు, పద్మ, స్వర్ణలత, రాజు, యాదవరెడ్డి, ఎండీ హుస్సేన్, కిష్టస్వామి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న నాగరాజు

పథకాలు చేర్చడంలో సమన్వయం అవసరం

మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల పిలుపునిచ్చారు. మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులతో గృహలక్ష్మి పథకంపై సోమవారం సమీక్ష నిర్వహించారు. అర్హులైన వారందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అందాలని సూచించారు. దరఖాస్తు సమయంలో అద్దె ఇంట్లో ఉండి, ప్రస్తుతం ఇల్లు మారిన వారికి పథకం అమలు కావడం లేదన్నారు. అలాంటి వారు తమ ఆధార్‌కార్డు, మారిన అద్దె ఇంటి నంబర్, విద్యుత్ బిల్లులను తీసుకుని రావాలని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ ఆశ్రిత్ కుమార్, విద్యుత్ ఏడీఈ సుధాకర్‌రెడ్డి, ఏఈలు కొమరయ్య, హుస్సేన్, కృష్ణ ప్రసాద్, శ్రీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంజుల

విద్యుత్ తీగలు తెగిపడి..

మద్దూరు(హుస్నాబాద్): విద్యుత్ తీగలు తెగిపడి నాలుగు జీవాలు మృతి చెందిన ఘటన మండలంలోని వల్లంపట్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నారదాసు రమేశ్ జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి విద్యుత్ తీగలు తెగి జీవాలపై పడడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని, తనను ఆదుకోవాలని రమేశ్ కోరాడు.


జీవాల వద్ద రోదిస్తున్న రమేశ్

అ'పూర్వ'సమ్మేళనం


దుద్దెడ పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ ఉన్నత పాఠశాలలో 2006–07లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఉత్సాహంగా సాగింది. 18 యేళ్ల తరువాత వారంతా పాఠశాలలో కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను తలచుకొని సంతోషంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు గాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, మానయ్య, వెంకటకృష్ణ శర్మ, మహబూబ్ అలీ, పూలమ్మ, అనితాదేవి, ఉమారాణి, విజయభాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేశ్, నరేందర్, రాజు, సురేశ్, నరేశ్, స్వామి, చరణ్, పద్మ, శారద, శ్రీధర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌కు చెందిన బింగి స్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని సోమవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు దామోదర్, రత్నాకరరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

◆ దేవాలయాలపై దాడులు సరికాదు

గజ్వేల్‌రూరల్: హిందూ దేవాలయాలపై దాడులు చేయడం సరికాదని హిందూ సంఘాల నేతలు మండిపడ్డారు. సికింద్రాబాద్ ప్రాంతంలోని ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన ఘటనపై నిరసన తెలిపిన వారిపై లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తూ సోమవారం గజ్వేల్‌లో ర్యాలీ చేపట్టారు. అంగడిపేట హనుమాన్ ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు కొనసాగించారు. నందబాలశర్మ, శ్రీనివాసాచార్యులు, నరేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

◆ నైపుణ్యంతోనే ఉన్నత స్థాయికి..

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించినపుడే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమల క్రిస్టియాన అన్నారు. కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో మహింద్రా ప్రైడ్ క్లాస్‌రూమ్ ఒక వారం శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, ఉమారాణి, సందీప్, అన్వర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

◆ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రామశాఖ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యాదగిరి, రవికుమార్, కనకయ్య పాల్గొన్నారు.

◆ కరువు భృతిని విడుదల చేయండి

సిద్దిపేటకమాన్: బకాయి కరువు భృతిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగదు రహిత చికిత్స విధి విధానాలు రూపొందించి వెంటనే అమలు చేయాలని, పీఆర్‌సీ నివేదిక సమర్పించాలని అన్నారు. మండల యూనిట్ల సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బాలయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.